సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



ముంచుకొస్తున్న మిచాంగ్


పెదజాలరిపేటలో ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు

- 4, 5 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- 40 తుపాను రక్షిత కేంద్రాలు గుర్తింపు
- అధికారులకు సెలవులు రద్దు
- కలెక్టరేట్, జీవీఎంసీలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు


కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : మిచాంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతంలో ఈదురు గాలులతో పాటు అలలు ఎగిసిపడే అవకాశముండడంతో జాగ్రత్త చర్యలు చేపట్టింది. కలెక్టర్ డా.మల్లికార్జున.. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మతో కలిసి వివిధ శాఖల అధికారులతో వర్చువల్‌గా అత్యవసర సమీక్ష శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల ఈ నెల 4, 5 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో బలమైన గాలులు వీచే అవకాశమున్నందున తీర ప్రాంత మండలాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మత్స్యకారులెవరూ సముద్రంలోనికి వేటకు వెళ్లరాదని సూచించారు. జీవీఎంసీ పరిధిలో ముంపు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహ కాలువలను ముందుగా గుర్తించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా కోసం పంపింగ్ స్టేషన్‌ల్లో డీజిల్ జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈని ఆదేశించారు. తుపాను సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే ఇన్వెంటరీ లెవెల్ ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధం చేయాలని ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్‌ను ఆదేశించారు. వర్షం తర్వాత విద్యుత్ సరఫరాని వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పవర్ చార్జర్స్, పవర్ కట్టర్స్, పవర్ సాస్ తదితర పరికరాలతో సిద్ధంగా ఉండాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతిని ఆదేశించారు.

అవసరమైతే తుఫాన్ బాధితులకు అందించేందుకు రేషన్ సిద్ధంగా ఉంచాలని, రక్షిత కేంద్రాలలో రేషన్ పంపిణీపై ఏర్పాట్లు చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్‌కు సూచించారు. రైతులకు తుపాను సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని వ్యవసాయ శాఖ జేడీ అప్పలస్వామిని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోని ఆదేశించారు. కేజీహెచ్, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అలర్ట్‌గా ఉండాలన్నారు. అగ్ని మాపక కేంద్రాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు.

రక్షిత కేంద్రాల్లో 50 వేల మందికి వసతి

తుపాను సమయంలో ప్రజలను అవసరం మేరకు సైక్లోన్ షెల్టర్లకు తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ పరిధిలో 25, గ్రామీణ ప్రాంతంలో 20 చొప్పున మొత్తం 40 తుపాను రక్షిత కేంద్రాలు గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో సుమారు 50 వేల మందికి వసతి కల్పించవచ్చన్నారు. ఈ కేంద్రాల్లో భోజనాల ఏర్పాట్లు, లైటింగ్ సదుపాయం, మెడికల్ కిట్స్, దుప్పట్లు, మంచినీరు వంటి సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్లను ఆదేశించారు. జెడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్ సహకారంతో గ్రామాల్లో తుపాను సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పూర్తి సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో అన్ని విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

తుపాను కంట్రోల్ రూమ్ నంబర్లు

కలెక్టరేట్
0891-2590100/102
జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబర్
180042500009
కంట్రోల్ రూమ్ నెంబర్
0891-2869106
మత్స్యకారుల కోసం
9390125477

'వాయు' ప్రతాపం!


కాపులుప్పాడ వద్ద కోసిన వరి చేనును కుప్పగా వేస్తున్న రైతులు

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావం విశాఖపై చూపుతోంది. శనివారం నుంచి ఇది మరింత తీవ్రతరమవుతోంది. రాత్రికి గాలుల ఉధృతి మరింత తీవ్రత పెరిగింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో శనివారం నుంచి మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లడం మానేశారు. బోట్లను తీరంలోను, ఫిషింగ్ హార్బర్ లోనూ లంగరేసుకున్నారు. మరోవైపు కోతకు వచ్చిన వరి పంటను రైతులు ముందు జాగ్రత్త చర్యగా కోతలు కోసి కుప్పలు వేస్తున్నారు. ఆదివారం తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడనుంది. దీంతో గాలుల ప్రభావం మరింతగా పెరగనుంది.

నేడు నగరానికి చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విశాఖలో ఆదివారం పర్యటించనున్నారు. విజయవాడ నుంచి విమానంలో మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సింహగిరికి చేరుకొని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకొని హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లనున్నారు.

11న కార్తీక దీపోత్సవం

ఎంవీపీకాలనీ: ఆర్.కె.బీచ్ వేదికగా ఈ నెల 11న నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం ఏర్పాట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో సదా భార్గవి శుక్రవారం సమీక్షించినట్లు సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంత గృహంలో జరిగిన ఈ సమీక్షలో విశాఖ నుంచి సంస్థ ప్రతినిధులు, దాతలు గ్రంధి రాజేష్, పైడా కృష్ణప్రసాద్ వర్చువల్‌గా హాజరైనట్లు పేర్కొన్నారు. ఎస్వీ సంగీత, సాంస్కృతిక కళాశాల విద్యార్థులతో కార్యక్రమాలు, వేదిక, ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు సహకారం, క్యూలు, విద్యుత్ దీపాల అలంకరణ, భద్రతా ఏర్పాట్లు, డిప్యూటేషన్‌పై ఉద్యోగులకు విధులు అప్పగింత తదితర అంశాలపై ఆయన సమీక్షించి పలు సూచనలు చేసినట్లు వెల్లడించారు. సమీక్షలో పలువురు టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

విశాఖ విద్య: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జరుగనుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందుకు 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ అర్బన్ పరిధిలో 6, భీమునిపట్నం పరిధిలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యేంత వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్ షిప్పు అందనుంది.

తుపాను దృష్ట్యా పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: తుపాను నేపథ్యంలో వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

3న రద్దయిన రైళ్లు : భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు(12845) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, పూరీ-చెన్నై(22859) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి (22871)ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీబెంగళూరు(12245) దురంతో ఎక్స్‌ప్రెస్, గౌహతి-ఎస్ఎంవీ బెంగళూరు(12510)ఎక్స్‌ప్రెస్, నాగర్‌కోయల్-షాలిమర్(12659), హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్, హౌరా-చెన్నై సెంట్రల్(12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్-చెన్నై సెంట్రల్(12841)కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి(12867)ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, టాటానగర్-ఎర్నాకుళం(18189)ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్-కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-తిరుపతి(22855)ఎక్స్‌ప్రెస్

4న రద్దయిన రైళ్లు : ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్(12846) ఎక్స్‌ప్రెస్, కడప-విశాఖపట్నం (17487)తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కడప(17488)తిరుమల ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-తిరుపతి (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై-పూరీ(22860)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-చెన్నై సెంట్రల్ (22869)ఎక్స్‌ప్రెస్, - తిరుపతి-భువనేశ్వర్(22872) ఎక్స్‌ప్రెస్, గౌహతి-ఎస్ఎంవీ బెంగళూరు(12510)ఎక్స్‌ప్రెస్, హౌరా-చెన్నై సెంట్రల్(12839)మెయిల్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హౌరా(12840)మెయిల్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్-చెన్నై సెంట్రల్(12841)కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842)కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీబెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్-అలెప్పీ(13351)బొకారో ఎక్స్‌ప్రెస్, ముజఫర్‌పూర్-బెంగళూరు(15228)ఎక్స్‌ప్రెస్, తాంబరం-సిల్ఘాట్(15629)ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం-పాట్నా(22643)ఎక్స్‌ప్రెస్, హతియా-ఎర్నాకుళం(22837)ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-తాంబరం(22841)ఎక్స్‌ప్రెస్, తిరుపతి-సంత్రగచ్చి(22856)ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీబెంగళూరు(22863) ఎక్స్‌ప్రెస్

5న రద్దయిన రైళ్లు : విశాఖ-కడప-విశాఖ (17488/47)తిరుమల ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-విశాఖపట్నం(22870)ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12246) దురంతో ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి(12509) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(12836)ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-హౌరా(12840)మెయిల్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్-చెన్నై సెంట్రల్(12841)కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎస్ఎంవీబెంగళూరు(12863) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీబెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం-టాటానగర్(18190)ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(18638)ఎక్స్‌ప్రెస్, విల్లుపురం-ఖరగ్‌పూర్(22603) ఎక్స్‌ప్రెస్

6న రద్దయిన రైళ్లు : కడప-విశాఖపట్నం (17487)తిరుమల ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూర్-బరౌని(03358)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి(12509)ఎక్స్‌ప్రెస్, షాలిమర్-నాగర్‌కోయల్(12660), చెన్నై సెంట్రల్-హౌరా(12840)మెయిల్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842)కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీబెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి-హౌరా(12868)ఎక్స్‌ప్రెస్, అలెప్పీ-ధన్‌బాద్(13352)బొకారో ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి-డిబ్రూఘడ్(22503) వివేక్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం-హతియా(22838)ఎక్స్‌ప్రెస్, తాంబరం-సంత్రగచ్చి(22842)ఎక్స్‌ప్రెస్ ఎస్ఎంవీబెంగళూరు-హౌరా(22864) ఎక్స్‌ప్రెస్

7న రద్దయిన రైళ్లు : అలెప్పీ-ధన్‌బాద్(13352)బొకారో ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-ముజఫర్‌పూర్(15227) ఎక్స్‌ప్రెస్, ఖరగ్‌పూర్-విల్లుపురం(22603)ఎక్స్‌ప్రెస్, పాట్నా-ఎర్నాకుళం(22644)ఎక్స్‌ప్రెస్





చతికిలపడ్డ గంభీర్ సేన

- ఉత్కంఠ పోరులో మణిపాల్ టైగర్స్ విజయం
- నేడు గుజరాత్ జెయింట్స్‌తో సదరన్ సూపర్‌స్టార్స్ ఢీ


గ్యాలరీలో క్రీడాభిమానుల కేరింతలు


బంతిని బౌండరీకి తరలిస్తున్న గంభీర్


యాష్లే వికెట్ తీసిన పంకజ్‌ను అభినందిస్తున్న మణిపాల్ కెప్టెన్ హర్భజన్ సింగ్

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియంలో గంభీర్ సేన చతికిల పడింది. గెలవాల్సిన మ్యాచ్‌లో పట్టు కోల్పోయి ఓటమి పాలైంది. దీంతో హర్భజన్ సేన ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరు పాయింట్లు సాధించింది ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శనివారం లెజెండ్ లీగ్ క్రికెట్ చివరి దశ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ మూడు మ్యాచ్‌లు జరగనుండగా.. తొలి మ్యాచ్‌లో మణిపాల్ టైగర్స్‌తో ఇండియా క్యాపిటల్స్ తలపడింది. నాకవుట్ చేరాలంటే విజయమే లక్ష్యంగా ఆటను ప్రారంభించిన గౌతమ్ గంభీర్ సేన టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ ప్రారంభించింది. పావెల్, గంభీర్ ఓపెనింగ్ బ్యాటర్స్‌గా క్రీజ్‌లోకి రాగా తొలి బంతిని మిచెల్ విసిరాడు. గంభీర్ వరసగా తొలి ఓవర్ చివరి మూడు బంతులను బౌండరీకి తరలించి మొత్తంగా 15 పరుగులు రాబట్టాడు. జట్టు 31 పరుగుల వద్ద గంభీర్ ఔటయ్యాడు. తర్వాత వన్‌డౌన్‌గా వచ్చిన భరత్ చిప్లి 65 పరుగులతో అజేయంగా నిలవగా, వికెట్ కీపర్ బ్యాటర్ బెన్ డంక్ 33 పరుగులు, యాష్లే మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 12 బంతుల్లోనే 26 పరుగులు రాబట్టారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 186 పరుగులతో క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ముగించింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన టైగర్స్ జట్టు ఒక బంతి మిగిలి ఉండగా నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టైగర్స్ తరఫున గ్రాండ్ హోమ్ (58) అర్ధ సెంచరీ నమోదు చేయగా.. వాల్టన్ 23, అమిత్ 48 పరుగులతో సహకరించారు. చివరి మూడు ఓవర్లలో 33 పరుగులు చేయాల్సిన స్థితిలో అప్పటికే టైగర్స్ ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో తిసారా పెరీరా చెలరేగి 16 బంతుల్లో నాలుగు ఫోర్లతో 32 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించాడు. కాగా.. ఐపీఎల్ తరహాలోనే విశాఖలో కూడా బాణసంచాతో జట్లకు స్వాగతం పలికారు. అభిమానులు సైతం స్టేడియంలో కొన్ని గ్యాలరీల్లో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించారు. కేరింతలు కొడుతూ క్రికెటర్లను ఆద్యంతం ఉత్సాహపరిచారు.


బంతిని బలంగా బాదుతున్న మణిపాల్ బ్యాటర్

ప్రత్యేక ఆకర్షణగా యువ మహిళా అంపైర్

విశాఖ వేదికగా జరుగుతున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్ టోర్నీ(ఎల్ఎల్‌సీ)లో భారత యువ మహిళా అంపైర్, గ్వాలియర్‌కు చెందిన శుబ్ధ భోంస్లే గైక్వాడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐపీఎల్ తరహా టీ-20 మ్యాచ్‌ల్లో మెన్ అంపైర్లు చూస్తుంటాం. అయితే ఇక్కడ శుబ్ధ అంపైర్‌గా చక్కగా వ్యవహరించారు. ఎల్ఎల్‌సీ గత సీజన్‌లో పలు మ్యాచ్‌లకు ఫీల్డ్ అంపైర్‌గా, దుబాయ్‌లో జరిగిన డీఎస్‌సీ టోర్నీలోనూ రెండు మ్యాచ్‌లకు అంపైర్‌గా ఉన్నారు. విశాఖలో జరిగిన ఈ మ్యాచ్.. అంపైర్‌గా ఆమెకు ఆరోది కావడం విశేషం.


అంపైర్ శుబ్ధ భోంస్లే

ప్రాణం తీసిన దుప్పటి వివాదం

ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరు దారుణ హత్య


కిరణ్ కుమార్ మృతదేహం, నిందితులు కొల్లాపల్లి శ్రీరాములు, మోహన్

అక్కిరెడ్డిపాలెం: దుప్పటి విషయంలో చెలరేగిన వివాదంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇద్దరు కలిసి అతన్ని రాయి, రాడ్డుతో చంపేశారు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. దున్న కిరణ్ కుమార్(24), మోహన్, కొల్లాపల్లి శ్రీరాములు, మరికొందరు రోడ్ల పక్కన పడి ఉండే ఇనుము, ఇతర వస్తువులను సేకరించి స్క్రాప్ దుకాణాల్లో విక్రయిస్తుంటారు. వచ్చిన డబ్బులతో మద్యం, మత్తు పదార్థాలు సేవించి రాత్రి వేళల్లో చట్టివానిపాలెం శ్మశానవాటిక, పాత శివాలయం పరిసరాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటారు. వీరికి సరైన నివాసం అంటూ లేదు. కాగా.. శుక్రవారం రాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో శ్రీరాములు.. కిరణ్‌కుమార్ దుప్పటిని తీసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శ్రీరాములు రాయితో కిరణ్ తల వెనుక భాగంలో కొట్టడంతో తీవ్ర గాయమైంది. ఓ పక్క అతనికి తీవ్ర రక్తస్రావం అవుతున్నా.. అక్కడే ఉన్న మోహన్‌ను.. కిరణ్‌ను కొట్టమని శ్రీరాములు ప్రేరేపించాడు. మత్తు పదార్థాలు సేవించి ఉన్న మోహన్ పక్కనే ఓ దుకాణానికి ఉన్న రాడ్డును తీసుకుని కిరణ్ తలపై రెండు సార్లు బలంగా కొట్టాడు. వెంటనే ఓ బండరాయిని తీసుకుని అతని కాళ్లపై పడేయడంతో తీవ్ర గాయమైంది. ఇది గమనించిన స్థానికులు 108, డయల్ 100కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి గాజువాక పోలీసులు చేరుకున్నారు. అప్పటికే వచ్చిన 108 సిబ్బంది కిరణ్ మరణించినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. కిరణ్ స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా బారువా కాగా.. నిందితుల వివరాలు తెలియలేదు. నిందితులను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కొన్ని రద్దు.. మరికొన్ని రైళ్లు దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 4 నుంచి 17 వరకు గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, 5 నుంచి 18 వరకు రాయగడ - గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్, 4 నుంచి 17 వరకు గుంటూరు - విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 5 నుంచి 18 వరకు విశాఖ - గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 4 నుంచి 17 వరకు మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్, 5 నుంచి 18 వరకు విశాఖపట్నం - మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, 4, 5, 6, 8, 9, 11, 12, 13, 15, 16న విశాఖపట్నం - విజయవాడ - విశాఖపట్నం (22701 / 22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 4 నుంచి 17 వరకు కాకినాడ -విశాఖపట్నం-కాకినాడ (17267/17268) స్పెషల్ రద్దు చేశారు.

దారి మళ్లింపు : కింది రైళ్లు రెగ్యులర్ మార్గమైన విజయవాడ -ఏలూరు- నిడదవోలు మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో విజయవాడ-గుడివాడ -భీమవరం టౌన్-నిడదవోలు మీదుగా ఆయా తేదీల్లో రాకపోకలు సాగిస్తాయి.

- ఈ నెల 4, 11న బయల్దేరే ఎర్నాకుళం-పాట్నా (22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 6, 8, 13, 15న బెంగళూరు - గౌహతి (12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4, 6, 8, 9, 11, 13, 15, 16 తేదీల్లో ముంబయి-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 4 నుంచి 17వ వరకు ధన్‌బాద్ - అలెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్, 8, 15 తేదీల్లో టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, 7, 14 తేదీల్లో టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 5, 10, 12, 17 తేదీల్లో హతియా - ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, 6, 13 తేదీల్లో జసిద్ధి-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 4, 11 తేదీల్లో హతియా - ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్, 9, 16 తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో మళ్లించారు.

గమ్యం కుదించిన రైళ్లు : ఈ నెల 4, 5, 6న విశాఖపట్నం - కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5, 6, 7న దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 4, 5, 6న విశాఖపట్నం - కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖపట్నం (08552) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5, 6, 7న దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

- వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ఏడీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

దొండపర్తి: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలో రహదారి ప్రమాదాల నివారణపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఒక హోటల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర జనాభా పెరుగుతూ ఉందని, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలన్నారు. అలాగే కార్లలో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. గతేడాది నగరంలో సంభవించిన మరణాల్లో మూడో వంతు మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారానే జరిగాయని వెల్లడించారు. హోటళ్లు, బార్ల నిర్వాహకులు కూడా సామాజిక బాధ్యతతో మెలగాని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్, సీఐలు సూర అమ్మినాయుడు, ప్రసాద్, సూరినాయుడు, ఎస్ఐలు, వివిధ హోటళ్లు, బార్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థల అధినేతకు పితృ వియోగం


చంద్రశేఖర్ రావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర్‌రావు (92) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. చంద్రశేఖర్‌రావుకు ముగ్గురు కుమారులు నున్న తిరుమలరావు, కృష్ణ, సురేష్, కుమార్తె హేమంతపద్మావతి ఉన్నారు. ఆయన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా వారి పిల్లలను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. తన పెద్ద కుమారుడైన నున్న తిరుమలరావు తిరుమల విద్యా సంస్థలను స్థాపించి నేడు ఎంతోమందికి విద్యనందిస్తున్నారు. చంద్రశేఖర్‌రావు పార్థివదేహానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పలువురు ప్రముఖులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు నివాళులు అర్పించారు.

కోస్ట్‌గార్డు ఉద్యోగాలకు పరీక్ష

విశాఖ విద్య: ఇండియన్ కోస్ట్ గార్డు ఉద్యోగాల ఎంపిక కోసమని శనివారం పరీక్ష జరిగింది. ఎన్ఏడీ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష రాసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సైతం అభ్యర్థులు హాజరయ్యారు. ఒక్కో షిఫ్టులో 340 మంది చొప్పున మూడు షిఫ్టులుగా పరీక్ష ఏర్పాటు చేయటం జరిగిందని కేంద్రం నిర్వాహకులు తెలిపారు.